చేతి రాతపై పట్టు.. మార్కులు కొల్లగొట్టు



పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు దస్తూరీ కీలకం

ముత్యాల్లా రాస్తే అదనపు మార్కులు సొంతం

నిరంతర సాధనతోనే అది సాధ్యం



అల్లిపురం: చేతి రాత బాగుంటే తలరాత బాగుంటుంది అంటారు పెద్దలు. చేతి రాత ఒక వ్యక్తి జీవితంపై ప్రభావం చూపుతుందని ఆధారాలు ఉన్నాయి. చేతి రాత జ్ఞాపకశక్తిపై కూడా ప్రభావం చూపుతుంది. ఇది కంప్యూటర్‌పై అక్షరాలు పేర్చే ఆధునిక యుగమైనప్పటికీ చేతి రాత స్థానం ప్రత్యేకం. ఒక వ్యక్తి చేతి రాతను బట్టి ఆ వ్యక్తి గుణగణాలను సైతం అంచనా వేయవచ్చంటారు గ్రాఫాలజిస్టులు. పరీక్షల్లో అదనపు మార్కులు సాధించేందుకు దస్తూరీ కీలకమని చెప్పవచ్చు. సమాధాన పత్రం మూల్యాంకనం చేసేవారి మనసును హత్తుకునేలా దస్తూరీ ఉండి, విషయం ఉంటే ఎక్కువ మార్కులు స్కోరు చేయవచ్చు. పది, ఇంటర్, డిగ్రీ పరీక్షలు సమీపిస్తున్నాయి. ఈ తరుణంలో విద్యార్థుల ధ్యాసంతా చదువుపైనే ఉంటుంది. చేతిరాతపై దృష్టి పెట్టేది మాత్రం అతి కొద్దిమందే. పరీక్షల్లో ఉన్నది ఉన్నట్లు రాసినా.. దస్తూరీ బాలేకుంటే మార్కులు తగ్గే ప్రమాదం ఉంది. ఏం రాశామన్నది పేపరు మూల్యాంకనం చేసే వ్యక్తికి అర్థమైతేనే ఎక్కువ మార్కులు వేసేందుకు అవకాశం ఉంటుంది. ఏడాది పాటు చదివిన అంశాలను రెండున్నర గంటల్లో సమాధాన పత్రంపై పెట్టాలి. పరీక్ష సమయంలో సహజంగా హడావుడి, ఆందోళన ఉంటుంది. మొదటి ప్రశ్న చక్కగా రాసినా తర్వాత కాలం గడిచే కొద్దీ వేగం పెరగడంతో కొందరు రాతపై పట్టు కోల్పోతుంటారు. దీన్ని అధిగమించాలంటే ముందుగా దస్తూరీ సాధన చేస్తే పరీక్షల్లో ఇబ్బందులు ఉండవన్నది నిపుణుల అభిప్రాయం.



దస్తూరీపై దృష్టి సారించాలి..

దక్షిణ నియోజకవర్గంలో పాత పోస్టాఫీసు, అల్లిపురం, ప్రకాశరావుపేట, రెల్లివీధి, ఎన్‌జీజీవోస్ కాలనీ, అచ్చియ్యమ్మపేట, రైల్వేక్వార్టర్స్, సౌత్ జైలురోడ్డు, ఆశీలమెట్ట తదితర ప్రాంతాల్లో హై స్కూళ్లు, ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఉన్నారు. వారంతా త్వరలోనే మార్చి, ఏప్రిల్‌లో జరిగే పరీక్షలకు హాజరవుతారు. పరీక్షలతో పాటు చేతిరాతపై కూడా వారు దృష్టి పెట్టాల్సిన తరుణం ఆసన్నమయింది.

జవాబు పత్రంలో జాగ్రత్తలు తప్పనిసరి..

- సమాధాన పత్రంలో జవాబు సూటిగా ఉండటంతో పాటు అక్షరాలు పొందిగ్గా ఉంటే పేపరు దిద్దేవారు ఒకటికి రెండు మార్కులు అదనంగా వేసే అవకాశం ఉంటుంది.
- పేజీపై భాగంలో ఒక అంగుళం, ఎడమ వైపు అదే స్థాయిలో మార్జిన్లు విడిచిపెట్టాలి.

సామాన్య, భౌతిక శాస్త్రంలో బొమ్మలు గీసి భాగాలను గుర్తించే విషయంలో పెన్నును నొక్కి పెట్టి రాయకూడదు. రోజూ కొద్దిసేపు రాత సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు. జవాబులు రాసేటప్పుడు ప్యాడ్ పైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకూ కూర్చుని రాయడం మంచిది. అక్షరాలు, పదాలు, వాక్యాలమధ్య తగినంత ఖాళీ ఉండేలా చూసుకోవాలి.

దస్తూరీ బాగుంటే అదనపు మార్కులు..




సాంకేతికంగా ఎంత ఎదిగినా చేతి రాత ప్రాధాన్యం చేతి రాతదే. భాషపై పట్టు ఉంటే రాయడం తేలిక అవుతుంది. దస్తూరీ బాగున్న విద్యార్థులు అదనంగా మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. చేతిరాతపై దృష్టి పెట్టేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి.

– ఆర్‌వీవీఎస్ నాగభూషణం, ప్రధానోపాధ్యాయులు, మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్.

సాధన ముఖ్యం..

రాసేటప్పుడు కూర్చునే భంగిమ, కలాన్ని పట్టుకునే విధానం, కాగితానికి, కలానికి మధ్య దూరం వంటి అంశాలు కీలకం. పరీక్ష పేపరుపై అంగుళం దూరంలో పెన్ పాయింట్ ఉండాలి. సున్నా, అరసున్నా, నిలువు గీతలపై బాగా సాధన చేయాలి. ఆంగ్లం, తెలుగు భాషల్లో మెరుగైన రాత కోసం సవ్య దిశలో రాయడం సాధన చేయాలి. నిర్విరామంగా సాధన చేస్తే అద్భుతమైన చేతి రాత సొంతమవుతుంది. సమాధాన పత్రం రాసేటప్పుడు గణితంలో సూత్రాలు, సమీకరణాలు కొట్టొచ్చినట్లు కనిపించాలి. చిత్రపటాలు ఉంటే వాటిని ఆకట్టుకునేలా వేయాలి. శీర్షికలు, ఉప శీర్షికలు స్పష్టంగా కనిపించేలా వాటి కింద గీతలు (అండర్‌లైన్) చేయాలి. అవసరమైన చోట విరామ చిహ్నాలు ఉండేలా చూసుకోవాలి.

పిల్లలకు చేతిరాత ముఖ్యం..



పిల్లలకు చేతిరాత చాలా ముఖ్యం. చేతి రాత అనేది వారి బ్రెయిన్ రైటింగ్. చేతిరాతలో స్పష్టత ఉంటే వారిలో ఉన్న కాన్ఫిడెన్స్ తెలుస్తుంది. వారిలో ఉన్న డిసిప్లిన్ అర్థమవుతుంది. లెఫ్ట్ మార్జిన్, రైట్ మార్జిన్‌ల వల్ల వారిలో క్రమశిక్షణ అర్థమవుతుంది. పదానికి పదానికి మధ్య గల అమరికను చూసి విద్యార్థుల స్థితప్రజ్ఞతను తెలుసుకోవచ్చు. లైను లైనుకు మధ్య గ్యాప్‌లను బట్టి వారి విశ్వసనీయత అర్థమవుతుంది. లైన్లు కుడిచేతి వైపు పైకి వెళ్తే వారిలో ఆత్మస్థైర్యం, కిందకి వస్తే వారిలో మానసిక ఆందోళన ఉన్నట్లు గుర్తించవచ్చు. 14 సంవత్సరాలు వచ్చిన పిల్లలకు గ్రాఫో థెరపీ చేయిస్తే వాళ్ల న్యూరాన్‌లలో వచ్చే మార్పులు తెలుస్తాయి. దానిని బట్టి చర్యలు తీసుకుంటే వారి మానసిక స్థితి మెరుగుపడుతుంది. అలాగే పిల్లల సంతకాన్ని బట్టి వారి మానసిక స్థితితో పాటు వారిలో పాజిటివిటీ ఎంత ఉందో తెలుసుకోవచ్చు. పిల్లలు చేసే సంతకాలు సక్రమంగా ఉంటే వారిలో పాజిటివ్ దృక్పథం ఉందని అర్థమవుతుంది.

– డాక్టర్ మహ్మద్ దావూద్, వరల్డ్ ఫేమస్ ఆస్ట్రో న్యూమరో గ్రాఫాలజిస్ట్

మానసిక ఆందోళన వద్దు..



పరీక్షల సమయంలో మానసిక ఆందోళనకు గురి కాకూడదు. ఆందోళన కారణంగా అక్షరాలు సరిగ్గా రాయలేరు. కూర్చునే విధానం, పెన్ను పట్టుకునే తీరు కూడా రాతపై ప్రభావం చూపుతాయి. రాత్రితెల్లారు చదివి పరీక్ష హాలుకు వెళ్లకూడదు. తగిన విశ్రాంతి తీసుకోవాలి.

–జీవీవీ నారాయణ, తెలుగు ఉపాధ్యాయుడు, ఎంజీఎం హైస్కూల్



క్లుప్తంగా

ఘనంగా బల్లల పండగ



చిన దుర్గాలమ్మకు పూజలు చేస్తున్న రజక సంఘం ప్రతినిధులు

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు పరిధి, అచ్చియ్యమ్మపేటలో చిన్న దుర్గాలమ్మ రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బల్లల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా వారు చిన దుర్గాలమ్మకు పూజలు చేశారు. అనంతరం బల్లలకు పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రజక కుటుంబాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ భోగి పండగ నుంచి బల్లలపై ఎటువంటి కార్యకలాపాలు, పనులు చేపట్టమన్నారు. బల్లల పండగ అనంతరం బల్లలపై పనులు చేపడతామన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక హారతి ఇస్తున్న పూజారి విజయమ్మ

కంచరపాలెం: కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఆలయ ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు



మూలవిరాట్టుకు పూజలు చేస్తున్న అర్చకుడు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై అలివేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తికి మాఘమాసం మూడవ ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు ప్రత్యేకంగా గోక్షీరంతో అభిషేకం, పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం మందార, చామంతి, గులాబీ పూలతో స్వామి వారిని విశేషంగా అలంకరించారు. ఉషా, ఛాయా సమేత సూర్యనారాయణస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శికి సత్కారం



ఆదివిష్ణురెడ్డిని సత్కరిస్తున్న అలపన కనకరెడ్డి తదితరులు

జగదాంబ: వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రటరీగా ఎన్నికైన అబ్బిరెడ్డి ఆదివిష్ణురెడ్డిని వార్డు నాయకుడు అలపన కనకరెడ్డి తదితరులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కనకరెడ్డి మాట్లాడుతూ ఆదివిష్ణురెడ్డిని ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. ఈ ఎంపికతో పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సువార్తరాజు, నౌషద్, మల్లా బుజ్జి, సిమ్మ, పుష్ప, రవికుమార్, గంగాధర్, శ్రీనివాసరెడ్డి, రమణమ్మ, వినోద్, లండా రమణ తదతరులు పాల్గొన్నారు.

36వ వార్డులో మహాన్నదానం



అన్నదానం చేస్తున్న మాసిపోగు రాజు తదితరులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజువీధిలో వెలసిన నీలమ్మ 43వ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణం వద్ద మహాన్నదాన కార్యక్రమం చేపట్టారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు మాసిపోగు రాజు పాల్గొని అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో కుందేటి సుధాకర్, నీలమాంబ ఆలయ కమిటీ అధ్యక్షుడు సూర్యనారాయణ, శేషగిరి నాగభూషణం, కేబుల్ కుమార్, కేవీ నర్సింగరావు, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు, జగన్మోహన్, కమిటీ సభ్యులు, నీలమాంబ ఆటోస్టాండ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీగా పూర్ణామార్కెట్..



పూర్ణామార్కెట్ రోడ్డుపై ఖాళీగా కూర్చున్న వ్యాపారులు



ఆదివారం ఖాళీగా ఉన్న పూర్ణామార్కెట్

జగదాంబ: ఇటీవల పూర్ణామార్కెట్‌లో రహదారి ఆక్రమణదారులను పోలీసులు, జీవీఎంసీ అధికారులు ఖాళీ చేయించారు. దీంతో మార్కెట్ రోడ్డు ఖాళీ అయి సులువుగా రాకపోకలు సాగించగలుగుతున్నారు. కానీ చిరు వ్యాపారులు రోడ్డున పడ్డారు. వ్యాపారం లేక, ఉపాధి కాన రాక ఆదుకునే వారి కోసం ఎదురు చూస్తున్నారు.

కానరాని రద్దీ..

నిత్యం జన సంచారంతో ఉండే పూర్ణామార్కెట్ ఆదివారం బోసిపోయింది. మార్కెట్ బయటి దుకాణాలను అధికారులు తొలగించడంతో రద్దీకి చెక్ పెట్టినట్లయింది. దీంతో మార్కెట్‌కు వచ్చేవారు సులువుగా రాకపోకలు చేయగలుగుతున్నారు.

సిద్ధమవుతున్న హెలికాప్టర్ మ్యూజియం



హెలికాప్టర్ మ్యూజియం ప్రవేశ ద్వారం



సుందరీకరణలో భాగంగా నాటిన మొక్కలు

ఏయూక్యాంపస్: పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని అందించేందుకు బీచ్ రోడ్డులో యూహెచ్3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం సిద్ధమవుతోంది. తుది మెరుగులు దిద్దుకుంటూ కొద్ది రోజుల్లో ప్రారంభానికి ముస్తాబవుతోంది. ప్రస్తుతం ఈ ప్రాంగణం చుట్టూ పచ్చదనం, మొక్కలు పెంచే పనులు జరుగుతున్నాయి. లాన్‌లో వేయడానికి ప్రత్యేక గ్రీన్ లాన్ తీసుకువచ్చారు. యుద్ధ విమానం మ్యూజియం బయట లాన్‌లో అవసరమైన ప్రాంతంలో వీటిని పరచే పనులు నిర్వహిస్తున్నారు. అదే ప్రాంగణంలో పచ్చదనం పెంచే చర్యల్లో నిర్లక్ష్యం తాండవిస్తోంది. కొన్ని మొక్కల వేళ్లు బయటకు కనిపిస్తున్నాయి. మొక్కలు నాటడంతో లోపాలను సరిచేయాల్సిన అవసరం ఉంది.



వేళ్లు బయటకు వచ్చిన మొక్క

మాధవుని సన్నిధిలో మాఘమాస పూజలు



జలధార వద్ద పుణ్య స్నానమాచరిస్తున్న భక్తులు

మద్దిపాలెం : ప్రాచీన ఆలయంగా ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీ లీలా మాధవస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మాఘమాసం మూడో ఆదివారం కావడం, తీర్థ మహోత్సవం (పరస) నిర్వహించడంతో పెద్ద ఎత్తున భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకుని ముందుగా జల'ధార' వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం లీలా మాధవస్వామిని, వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ మహోత్సవం (పరస)లో పాల్గొన్న భక్తులు అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లు చేశారు. పోలీస్‌లు బందోబస్తు నిర్వహించారు.

మురుగుతో ముప్పుతిప్పలు

- హార్బర్‌లో పొంగిపొర్లుతున్న మురుగు నీరు
- దోమలు, ఈగల స్వైరవిహారం



హార్బర్‌లో నిలిచిపోయిన మురుగు నీరు



డ్రైనేజీలు లేక నిలిచిపోయిన మురుగు నీరు

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌లో తీవ్ర డ్రైనేజీ సమస్య ఏర్పడింది. ఇక్కడి పలు ప్రాంతాల్లో మురుగు నీరు పొంగి ప్రవహిస్తోంది. పలు చోట్ల ఇది నిలిచిపోయింది. దీంతో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. ఫిషింగ్ హార్బర్‌లోని రొయ్యల కొనుగోలు కేంద్రం, చేపల విక్రయ కేంద్రాలు, ప్యాకింగ్ కేంద్రాల వద్ద నీరు చేరడంతో వ్యాపార లావాదేవీలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇక్కడి నుంచి నిత్యం ఎగుమతులు జరుగుతుంటాయి. పోర్ట్ అధికారులు డీపీఆర్ పనులు ప్రారంభించి ఆ పనిని సగంలో ఆపేయడం వల్ల మురుగు నీరు హార్బర్‌లో పొంగి పొర్లుతోంది. దీంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని మత్స్యకారులు భయపడుతున్నారు. ఇప్పటికే కొంత మంది మత్స్యకారులు జ్వరం, దగ్గు, రొంప వంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయ లోపం వల్ల తరచూ ఈ సమస్యలు తలెత్తుతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు.



మురుగుతో నిండిపోయిన కాలువ

దేవాలయంలోకి చేరిన ముగురు నీరు..

హార్బర్‌లోని విజయ గణపతి ఆలయంలోకి మురుగు నీరు చేరింది. దీని వల్ల పూజా కార్యక్రమాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ నీటిని దాటుకుని దేవాలయంలోకి వెళ్లాల్సి రావడంతో కొన్ని రోజుల నుంచి దేవాలయానికి వచ్చే భక్తుల సంఖ్య తగ్గిపోయింది.



చేపల కొనుగోలు కేంద్రం వద్ద అపారిశుధ్యం



హార్బర్‌లోని విజయ గణపతి ఆలయం వద్ద నిలిచిపోయిన మురుగు నీరు

ఫిర్యాదు చేసినా స్పందన లేదు..



డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని పలుమార్లు పోర్టు అధికారులు, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. తక్షణమే ఈ సమస్య పరిష్కరించి, మురుగు నీటిని మళ్లించాలి. పరిశుభ్రత చర్యలు చేపట్టాలి. ఆలయంలో పూజల నిర్వహణకు సహకరించాలి.

–బర్రె కొండబాబు, అధ్యక్షుడు, కోస్టల్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్

యువతికి వసతి కల్పన



ఏయూటీటీ కార్యదర్శి ప్రగడ వాసుతో యువతి

సీతమ్మధార: భర్త మద్యానికి బానిసై రోజూ చిత్రహింసలు పెడుతుండటంతో పాడేరుకు చెందిన ఆదివాసీ యువతి సాయి (20) ఇల్లు వదిలి ద్వారకానగర్‌లోని ఆర్‌టీసీ కాంప్లెక్స్ దగ్గర్లో ఉన్న టిఫిన్ షాపులో పనికి చేరింది. దిక్కు తోచని స్థితిలో ఉన్న ఆమె పరిస్థితి చూసి టౌన్ వెండింగ్ కమిటీ సభ్యుడు బాలు ఏయూటీడీ మహిళా షెల్టర్ హోంకి సమాచారం అందించారు. ఆమెకు తాత్కాలిక వసతి కల్పించినట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

రైతుబజారులో ఆకస్మిక తనిఖీ



నరసింహనగర్ రైతుబజార్‌లో తనిఖీ చేస్తున్న మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కిరణ్

సీతంపేట : మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కిరణ్ నరసింహనగర్ రైతుబజార్‌ను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బజార్‌లోని స్టాల్స్‌లో కూరగాయల విక్రయాలు, నాణ్యత, రైతుల గుర్తింపు కార్డులు పరిశీలించారు. డ్వాక్రా స్టాల్స్ పరిశీలించారు. వినియోగదారులతో రైతులు మెలుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన, తాజా కూరగాయలు వినియోగదారులకు అందించాలని ఆదేశించారు. అలాగే పాలిథిన్ సంచులు వాడరాదని సూచించారు. రైతులు ఎక్కువ మొత్తంలో పండించిన కూరగాయలు రైతు బజార్‌లో అమ్ముడుకాకపోతే తమ దృష్టికి తీసుకొస్తే... వేరే రైతు బజార్‌లో విక్రయించేలా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బజారు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీలలితాపీఠంలో సంకటహర చతుర్థి



శ్రీలలితాపీఠంలో గణపతికి హారతిస్తున్న దత్తేశ్వరానంద భారతిస్వామి

సీతంపేట: సంకటహర చతుర్థి సందర్భంగా స్థానిక లలితాపీఠంలో ఆదివారం సాయంత్రం వినాయకునికి పంచామృత అభిషేకం, అర్చన, అలంకరణ, ప్రత్యేక పూజలు, లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతి స్వామి గణపతికి పూజ చేసి హారతిచ్చారు. పీఠం అర్చకుల మంత్రోచ్చారణ మధ్య దూప దీప నైవేద్యం, గణేష్ స్తోత్రం, వ్రత కథ చదివారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో శాస్త్రోక్తకంగా లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. గణపతి హోమం వల్ల కార్యసిద్ధి, ఆరోగ్యం, విజయం లభిస్తాయని అర్చకులు తెలిపారు. బహుళ పంచమి సందర్భంగా సోమవారం సాయంత్రం వారాహి హోమం, బహుళ అష్టమి సందర్భంగా గురువారం ఉదయం 9:30 గంటలకు చండీ హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.